ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 28.11.95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు సుబ్రహ్మణ్య షష్ఠి. సుబ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మంగురించి బాగుగా తెలిసినవాడు, బ్రహ్మం గురించి స్పష్టంగా తెలిసినవాడు. సుబ్రహ్మణ్యుడను తమిళనాడులో మురుగన్ అంటారు. మురుగన్ అంటే అందమైన బిడ్డ అని అర్థము. శివుడు అభిషేకప్రియుడు, విష్ణువు అలంకారప్రియుడు, సుబ్రహ్మణ్యుడు దర్శనప్రియుడు అని చెపుతారు. సాక్షాత్తు సుబ్రహ్మణ్యుడే రమణమహర్షిగా అవతరించాడు అని గణపతిశాస్త్రిగారు చెపుతూ ఉండేవారు. మీరు సుబ్రహ్మణ్యుడు అవతారము అని శాస్త్రిగారు చెపుతున్నారు అని భగవాన్‌తో అంటే గుడిలో రాయినిపెట్టి సుబ్రహ్మణ్యుడు అనటం లేదా అలాగే ఈ దేహాన్ని సుబ్రహ్మణ్యుడు అని ఆయనను అనుకోనివ్వండి. శాస్త్రిగారి నోరును మనం కట్టలేముకదా. మనం ఆగమంటే ఆయన ఆగుతాడా అన్నారట. ఆయన రమణమహర్షి అంటే.

సాధారణంగా మానవులు ఈగోయిస్టులు అంటే అహంకారపూరితులు. వాడు ఏది ఆలోచించినా అహంకారమును కేంద్రముగా పెట్టుకొని ఆలోచిస్తాడు. వాడికి సత్యము అక్కరలేదు. వాడికి సమాజము ముఖ్యంకాదు, దేవుడు ముఖ్యంకాదు. వాడి అహంకారమే వాడికి ముఖ్యము. మనకు ఏ ఆలోచన వచ్చినా, ఏ తలంపువచ్చినా దేహమునకే పరిమితమై వస్తున్నాయి. మన బుద్ధి దేహమునకే పరిమితమై ఉంది. గాఢనిద్రనుండి జాగ్రదావస్థలోనికి రాగానే మొదట దేహము నేను అనే తలంపు వస్తుంది. అది వచ్చాక ఇతర తలంపులు వస్తాయి.

ప్రపంచములో అత్యంత నీచమైనది. ఎందుకూ పనికిరానిది, మనం ద్వేషించవలసినది, మనం పోగొట్టుకోవలసినది దేహగతమైన నేను మాత్రమే. ఇదిపోకుండా మీరు ఏలోకాలకు వెళ్లినా కర్మ మిమ్ములను వెంటాడుతుంది, జన్మపరంపరలు మిమ్ములను వెంటాడుతాయి. ఇతరులను మనం అసహ్యించుకోవటంకాదు. ఈ దేహగతమైన నేనునే మనం అసహ్యించుకోవాలి. ప్రపంచములో ఎందుకూ పనికిరానిది దేహగతమైన నేను. దీనినే అహంకారము అంటారు. దుఃఖాలకు, పునర్జన్మలకు అన్నింటికి ఇదే కారణము. దేహగతమైన నేను మంచిది అని మనం అనుకొంటున్నాము అందువలన దానిని తొలగించుకొనే ప్రయత్నం చేయటంలేదు. అది ఎందుకూ పనికిరానిది అని ముందు మనకు అవగాహన అయితే దానిని తొలగించుకొనే ప్రయత్నం చేస్తాము. మన హృదయంలో ఉన్న శాంతిసముద్రం మనకు అందకపోవటానికి కారణము కూడా ఇదే. అది మనకు తెలియటంలేదు.

మీకు శాంతిగా ఉంది అనుకోండి, ఆనందముగా ఉంది అనుకోండి, అలౌకికమైన ఆనందము, శాంతి మీరు అనుభవిస్తున్నారు అనుకోండి, అనిర్వచనీయమైన ఆనందము మీకు అనుభవంలోనికి వచ్చింది అనుకోండి అది జ్ఞానఫలము. మీ జ్ఞానమునకు ఫలముగా భగవంతుడు అనుగ్రహించాడు. జననము, మరణము, రోదనలు, వేదనలు, ఉద్రేకానికి గురికావటం ఇవిఅన్నీ అజ్ఞానఫలము. అగ్నిని విడిచిపెట్టి వేడి ఎలాగయితే వేరుగా ఉండదో అలాగే జ్ఞానమును విడిచిపెట్టి ఆనందము వేరుగాఉండదు.

భగవంతుడిని తెలుసుకోవటానికి ఏదో ఒక మార్గమును నమ్మి ప్రయాణం చేస్తున్నాడు అనుకోండి. ఎవరైనావచ్చి ఆమార్గము సరి అయినది కాదు అని ఇంకో మార్గమును సూచిస్తే అతను ప్రయాణించే మార్గమును వదిలివేస్తాడు.

మరల ఇంకోమార్గములో ప్రయాణిస్తాడు. ఎందుకు స్వీకరిస్తున్నాడో, ఎందుకు వదిలివేస్తున్నాడో వాడికే తెలియదు. స్వంతఆలోచన లేనందువలన ఇలా మార్గములలోనికి వెళతారు, వదలివేస్తూ ఉంటారు. అన్ని మార్గములు ఒక్కటే. స్వంతాలోచన లేనివాడికి ఆత్మవిశ్వాసము రాదు. ఆత్మవిశ్వాసము లేనివాడు జీవితంలో ఏదీ సాధించలేడు. ఏ మార్గములో ప్రయాణించినా గమ్యమును చేరుకోవచ్చు. ప్రపంచములో ఏదీ నాదికాదు అనుకోవటం జ్ఞానమార్గము. ఈ ప్రపంచము అంతా నాది అనుకోవటం కర్మమార్గము. స్వార్థపరుడు తన కుటుంబంకోసం ఎలా పనిచేస్తాడో ఈ సృష్టికోసం నీవు అలా పనిచేసినా మోక్షంవస్తుంది అని కృష్ణుడు చెప్పాడు.

మనము వివేకహీనముగా ప్రతీదీ నమ్ముతాము. సత్యవస్తువును తప్ప ప్రతీదీ నమ్ముతాము. నిజంకాని దానిని నమ్ముతాము. దీనికి కారణము రూపదృష్టి, నామదృష్టి. నిజంకానిదానిని నిజం అని నీవు అనుకోవచ్చు. ఎవరూ నిన్ను అడ్డుపెట్టరు. నిజంకానిదానిని నీవు నిజం అనుకొన్నంత మాత్రముచేత అది నిజం అవ్వదు. నిజాన్ని నమ్మటానికి ధైర్యంఉండాలి. ఎంతో వివేకవంతుడికిగాని నిజాన్ని నమ్మేశక్తి ఉండదు. ఏదైతే నిజంకాదో దానిని నిజం అనుకొంటున్నావు. ముందు ఆ భావన వదలిపెట్టాలి. ఎన్నో జన్మలనుండి నిజంకానిదానిని నిజం అని నమ్ముతున్నాము. దానిని విడిచిపెట్టాలంటే భయం కలుగవచ్చు. అప్పుడు మనకు ధైర్యంకావాలి, ప్రాక్టీసుకావాలి, ఆత్మవిశ్వాసము కావాలి.

మనమనస్సు నిజంకాకపోయినా దానికి సపోర్టులు పెట్టుకొని బ్రతుకుచున్నాము. ఈ సపోర్టులు ఎప్పుడో ఒకప్పుడు ఊడిపోవటం తప్పదు. సపోర్టులు అన్నీ ఊడిపోతేగాని నిజం ఏమిటో మనకు తెలియదు. మొత్తము సపోర్టులు తీస్తే భయపడతాడు అని గురువు సపోర్టులను కొద్దిగా కదుపుతాడు. అప్పుడు కూడా భయం కలుగవచ్చును. సపోర్టులను కదిపినప్పుడే భయంవేస్తే హృదయంయొక్క లోతులలోనికి ఇంక వాడు ఏమి దిగుతాడు. మనం మనస్సులో కొన్ని ఊహించుకొని వాటికి సపోర్టులు పెట్టుకొంటాము. నిజం కానిదానిని నిజం అనుకొని మనస్సుకు సపోర్టులు పెట్టుకొంటాము. గురువు ఏమిచేస్తాడు అంటే టైము చూసుకొని ఆ సపోర్టులను కొద్దిగా కదుపుతాడు. అప్పుడు తట్టుకొన్నావా నిన్ను హృదయాంతరాళములలోనికి తీసుకొని వెళ్తాడు. తట్టుకోలేకపోతే wait చేస్తాడు. మొత్తముమీద మనస్సుకు ఉన్న సపోర్టులు ఊడగొడతాడు. ఆ సపోర్టులు ఊడితేగాని మనస్సు వెళ్ళి హృదయగుహలో పడదు. నిజంకాని దానిని నిజం అనుకోవటం ఒక తలంపు. ఈ తలంపు మనలను కొన్నివేల జన్మలు ఈడ్చుకుని పోతుంది.

మనం పనిచేస్తాము. పని యొక్క ఫలితమును అనుభవిస్తాము. అది వాసనారూపంలో మనలో ఉంటుంది. స్మశానంలో శరీరమును కాల్చినపుడు ఈ వాసనలు కాలవు. ఇవి బహుజన్మలనుండి మనకూడా వస్తున్నాయి. భగవంతుడు చెప్పిన మాటలు నమ్ముదాము అని మనం ప్రయత్నం ప్రారంభించినా ఈ వాసనలు అడ్డువస్తాయి. భగవంతుని మాటలను నమ్మనివ్వవు. భగవంతుడు ఇలా చెప్పాడు కదా అని ఆలోచిస్తాము. పూర్వజన్మనుండి వచ్చిన వాసనలు మనలను సరిగ్గా ఆలోచన చేయనివ్వవు. ఈ వాసనలను మన ప్రయత్నం వలన తొలగించుకోలేము.. దీనికి గురువు అనుగ్రహం అవసరము.

ఆత్మానుభవం పొందాలి, జ్ఞానమును సంపాదించుకోవాలి అనే పట్టుదలతోనే ప్రయత్నం ప్రారంభిస్తావు. మొదట ఎంతవేగముగా అది తలపెట్టావో చివరకు ఆ పట్టుదల ఉండదు. మొదట బాగానే ప్రయత్నం చేస్తారు. కాని ఏదో వాసన అడ్డువస్తుంది. అప్పుడు నీ సాధన మందగించిపోతుంది. కొంతమంది పని ప్రారంభించి వదిలివేస్తారు. పని ప్రారంభించి అది చివరవరకు కొనసాగాలంటే దైవానుగ్రహం ఉండాలి. తరించాలి అనే సంకల్పము నీలోపలనుండి వస్తుంది. పని ప్రారంభిస్తావు. నీలోపల ఏవో బలహీనతలు ఉంటాయి. అవి వచ్చి నీ సాధనయొక్క వేగమును ఆపుచేస్తాయి. అదీ నీలోపలనుండే వస్తోంది, ఇదీ లోపలనుండే వస్తోంది.

నీ హృదయంలో సత్యంఉంది. దానిని నీవు కనిపెట్టనవసరములేదు. అది నీకు వ్యక్తంకాకుండా ఏవాసనలు

అయితే దానిని కవర్ చేస్తున్నాయో, ఆ కవర్‌ను తొలగిస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఇప్పుడు మనస్సు నీకు నేనుగా ఎలా వ్యక్తమవుతోందో అంత స్పష్టంగా నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది.

నేను అనే తలంపు నీలోపలనుండే వస్తోంది. నీలోపల ఎక్కడనుండి అది వస్తోందో అదే ఆధ్యాత్మిక హృదయము. అక్కడే దేవుడు ఉన్నాడు. దేవుడు ఎక్కడో దూరానలేడు. నీ దేహంకంటే, నీ ఇంద్రియాలకంటే అత్యంత సమీపంగా ఉన్నాడు. ఆధ్యాత్మిక హృదయం అంటే ఎక్కడో ఉంది అనుకోవద్దు, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకోవద్దు. నేను అనే తలంపుకు bottomలోనే దేవుడు ఉన్నాడు. నేను అనే తలంపుయొక్క మూలం నీకు తెలిస్తే సర్వత్రా ఉన్నవస్తువు కూడా నీకు వ్యక్తమవుతుంది.

ఎవరిని గురువుగా తీసుకోమంటారు అని అడిగితే ఎవడి సమక్షంలో కూర్చున్నప్పుడు నీ ప్రయత్నంలేకుండా నీ దుఃఖము అంతా ఆరిపోతుందో, శాంతి వచ్చి నిన్ను వరిస్తుందో అట్టివాడిని గురువుగా తీసుకో అని భగవాన్ చెప్పారు. ఎవడి సమక్షంలో కూర్చున్నప్పుడు జ్ఞానం సంపాదించాలనే బుద్ధి నీకు కలుగుతుందో వాడిని గురువుగా తీసుకో.

కోరికలను satisfy చేస్తూ ఏ కోరికను నీవు తొలగించుకోలేవు. వచ్చిన కోరికను ప్రతీదానిని తృప్తిపరుస్తూ కోరికలను జయించలేవు. కోరికలను జయించలేవు సరికదా వాటిబలం పెరిగిపోతుంది. నెరవేర్చటంవలన కోరికయొక్క వేగము పెరుగుతుంది. కోరిక హృదయ స్థలంలో ఉన్నంతకాలము అది నిన్ను ఏమీ బాధించదు. కోరిక ఉదయించకుండా చూసుకోవటం మంచిది. కోరిక ఉదయించాక దానిని తొలగించుకోవటం కష్టము. నీ మనస్సు ఇప్పుడు శిరస్సులో ఎంత సహజముగా ఉంటోందో అంత సహజముగా నీ హృదయంలో ఉండగలిగితే అక్కడ ఉన్నది దేవుడే కాబట్టి అప్పుడు నీకు అసలు కోరికలే ఉదయించవు.

నీకు నిజంగా కోరిక వచ్చింది అనుకో. ఈ కోరిక ఎవరికి వస్తోంది? అని చూడు. నాకు కోపం వచ్చింది అంటారు. నేను అనేది ఒక తలంపు. కోపం అనేది ఒక తలంపు. నేను అనే తలంపుకు కోపం అనే తలంపు వచ్చింది. కోపం అనే తలంపు ఏ నేనుకు వచ్చింది. ఏ నేనుకు కోపం వస్తోందో ఆ నేనును నీవు ప్రశ్నించాలి. నీవు ఎవడవు అని ఆ నేనును ప్రశ్నించాలి. అప్పుడు వాడు హృదయంలోనికి ఉపసంహరింపబడతాడు. మీకు ఎన్ని కోరికలు ఉన్నా, ఎన్ని సంస్కారములు ఉన్నా రానివ్వండి. కంగారు పడకండి. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా ఒక్క అగ్గిపుల్లకు లోకువ. అదేవిధంగా నీకు ఎన్ని సంస్కారములు ఉన్నా, ఎన్ని కోరికలు ఉన్నా ఈ నేను ఎవడను? అనే ప్రశ్న ముందు కాలి బూడిద అవుతాయి. కంగారు పడకండి. నీకు ఎన్ని కోరికలు ఉన్నా రానివ్వండి. ఇవి వచ్చే నేను ఎవడు?అని ప్రశ్నించుకోండి. నేనును ప్రశ్నించటంవలన దాని విజృంభణ ఆగుతుంది. అప్పుడు అది లోపలకు ఉపసంహరించబడుతుంది. నేను అనే తలంపుయొక్క పుట్టుక స్థానము నీలోపలే ఉంది. అది ఎక్కడైతే పుట్టిందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది. నేను అనే తలంపు దాని పుట్టు స్థానములోనికి ఎప్పుడైతే ఉపసంహరింపబడిందో దానికి వచ్చే ఇతర తలంపులు అన్నీ కూడా కరిగిపోతాయి.

దేహపోషణకు నీవు చేసే పనులు, ఆ కోరికలు నిన్ను బంధించవు. స్నానం చేయాలనే కోరిక, ఆకలి వేసినవుడు అన్నం తినాలి అనే కోరిక అవి నిన్ను బంధించవు. దేహపోషణకు అవి నీవు చేస్తున్నావు. అందువలన అవి నిన్ను బంధించవు. Enjoymentకోసం నీవు చేసేపనులు మాత్రమే నిన్ను బంధిస్తాయి.

సినిమా తారల ఫొటోలు ఎదురుగా పెట్టుకొని చూడటంవలన రజోగుణం పెరుగుతుంది. అవతార పురుషుల విగ్రహాలు, జ్ఞానుల విగ్రహాలు చూడటంవలన సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం నిజంకాదు. అది కూడా ఒక గుణమే కాని అది నిజం దగ్గరకు దారిని చూపిస్తుంది.

మనస్సుకు సుఖంకావాలి, శాంతికావాలి, ఆనందము కావాలి. దానికి కావలసిన సుఖము, శాంతి నీ హృదయంలోనుండి అందుతూఉంటే అది బాహ్యముఖానికి తిరగమన్నా తిరగదు. దానికి, చపలత్వం తగ్గిపోతుంది. దానికి కావలసిన ఆనందము హృదయంలోనుండి అందకపోతే నీవు ఆగమన్నా ఆగదు. ఆనందముకోసం తిరుగుతూనే ఉంటుంది. మానవునికి కావలసినది ఆనందము. ఈలోకంలో ఒక్క జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి.

(మీ ఇంటిలోనివారు ఎవరైనా చనిపోతే దుఃఖపడతారు. వారిగురించి దుఃఖపడటంకాదు. వారి గురించి మీలో ఉండి ఎవడైతే దుఃఖ పడుతున్నాడో వాడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి, వాడిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి. వాడుపోతే మీకు ఈ శరీరంలో ఉండగానే, ఈ లోకంలో ఉండగానే జ్ఞానం కలుగుతుంది.)

(అన్నింటికి మూలమైనది, అన్నింటికి జీవమైనది హృదయమే. జ్ఞానం కూడా నీ హృదయంలోనే ఉంది. మనకు భగవదనుభవం వచ్చినా అది హృదయంలోనే వస్తుంది. అన్నింటికి మూలమైనది హృదయమే అందుచేత నీకు ఏ అనుభవం వచ్చినా అది హృదయంలోనే కలగాలి. జీవిత సారమంతా హృదయంలోనే ఉంది. దేహము లేకపోతే లోకం లేదు, మనస్సు లేకపోతే దేహము లేదు, హృదయం లేకపోతే మనస్సు లేదు. ఈ కథ అంతా హృదయంలో ముగుస్తుంది. అంటే హృదయంలేకపోతే మనస్సు లేదు, మనస్సు లేకపోతే దేహము లేదు, దేహము లేకపోతే లోకం లేదు.) Heart

ఈశ్వరుని ఎందుకు స్మరించాలి అంటే ఈశ్వరానుగ్రహం పొందటంకోసం. అనుగ్రహం సహాయం లేకుండా మనకు దేహబుద్ధి నశించదు. అన్ని తలంపులకు, ఊహలకు, ఆలోచనలకు, ప్రకృతిగుణాలకు దేహబుద్ధే కారణము. సమస్త వికారములకు దేహబుద్ధే కారణము.

భగవంతుని అనుగ్రహం వలన మీకు డబ్బు, చదువు, కీర్తి వచ్చాయి అనుకోండి అవి సమాజమునకు ఉపయోగపడేలా ఉండాలి గాని, వాటివలన మీరు చెడిపోయేలా ఉండకూడదు. అవి మీ కంట్రోల్‌లో ఉండాలి గాని మీరు వాటి కంట్రోలులో ఉండకూడదు. భగవంతుడు మిమ్మలను ఏ మంచివిషయాలతో అయితే అనుగ్రహించాడో వాటిని సమాజమునకు ఉపయోగించాలి. సమాజమునకు ఉపయోగిస్తూ ఉంటే సమాజంలో ఉన్నవాడు దేవుడే కాబట్టి తద్వారా దేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు.

మనం దేవుని ఎక్కడ చూస్తున్నాము. గుడిలో చూస్తున్నాము. ఆ గుడిలో ఉన్న దేవుడిని సృష్టిలో అంతా చూసే శక్తి మనం సంపాదించాలి. అంతటా దేవుని చూడటం నేర్చుకుంటే మనకు బేధబుద్ధి నశిస్తుంది. బేదబుద్ధి ఉన్నంతసేపు మోహంలో పడతాము. బేధబుద్ధి ఉన్నంతసేపు బాహ్య విషయములలో ఏదో విషయమునకు ఆకర్షింపబడతాము. ఏదో విషయమునకు ఆకర్షింపబడుతున్నంతకాలము మనం దారి తప్పిపోతాము. ఏ పనిమీద ఈ భూమి మీదకు వచ్చామో ఆ పనిని మర్చిపోతాము. (మీరు వచ్చిన పనిని మర్చిపోకండి అని భగవాన్ చెపుతూ ఉండేవారు.) మనం జ్ఞాన సముపార్జనకు ఈ భూమి మీదకు వచ్చాము. ఈ భూమిమీదకు వచ్చినందుకు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి రాదు అనుకో. నీవు 100 సంవత్సరాలు జీవించినా జీవితం యొక్క ప్రయోజనం ఏమిటి? దేహ ప్రారబ్ధములో డబ్బు, చదువు, అధికారము ఉంటే అవి వస్తాయి. అది దేహ ప్రారబ్ధము. ప్రారబ్ధము అయిపోయినవెంటనే దేహము నశిస్తుంది. అదికాదు. నీవు వచ్చిన ప్రయోజనం ఏమిటి? నీవు సాధించవలసింది ఏమిటి? అది తెలుసుకో. ఒక్క బ్రహ్మానుభవం తప్ప నీవు ఏది సాధించినా అది స్వప్నసమానము.

Who am I? (కష్టాలు వచ్చినపుడు కర్మ అనుభవిస్తున్నాము అని చాలామంది అంటూ ఉంటారు. కర్మ అనుభవించేవాడు ఎవరు? అని రమణమహర్షిగారు అన్నారు. కర్మ దేహము అనుభవిస్తోందా, నీ లోపల ఉన్న దేవుడు అనుభవిస్తున్నాడా చెప్పండి. కర్మ అనుభవించేవాడు దేహగతమైన నేనే. ఎవడైతే కర్మను అనుభవిస్తున్నాడో వాడిని ప్రశ్నించండి.

వాడిని ప్రశ్నించినపుడు వాడు హృదయంలోనికి సర్దుకుంటాడు. అప్పుడు కర్మ అనుభవించేవాడు లేడు అని మనకు తెలుస్తుంది.

బ్రహ్మానుభవం కలిగిన తరువాత కూడా కొంతకాలము మీ దేహము ఉంటుంది. బ్రహ్మానుభవం కలిగిన వెంటనే దేహం చనిపోవాలి అని ఎక్కడా లేదు. బ్రహ్మానుభవం కలిగినపుడు రాగ ద్వేషములు చచ్చిపోతాయి గాని మీ దేహము చచ్చిపోదు. కంగారు పడవద్దు. దేహమునకు ప్రారబ్ధము ఉంటుంది కదా అది అనుభవించాక దేహము మరణిస్తుంది.

మనస్సును తీసుకొనివెళ్లి హృదయంలో ఉంచు. అప్పుడు మనస్సు కరిగిపోతుంది. కరిగిపోయి ఆత్మాకారం చెందుతుంది. మనస్సులో పరిమితులు ఉన్నాయి. పరిమితుల వలననే నీకు దుఃఖము వస్తోంది. మనస్సు హృదయంలో కరిగిపోయినపుడు పరిమితులు లేని వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.

మనం చెడిపోయినా, బాగుపడినా మన మనస్సే కారణము. మన మనస్సు స్వాధీనంలో ఉంటే దేశం అంతా వ్యతిరేకించినా నీవు సుఖంగా ఉంటావు. మనస్సు స్వాధీనంలో లేకపోతే ఇంటిలోనివారు అంతా మనలను సుఖపెట్టడానికి సిద్ధంగా ఉన్నా మనకు సుఖంరాదు. నీ మనస్సే నీకు శత్రువు. నీ మనస్సే నీకు మిత్రుడు. అందువలన నీ మనస్సును శత్రువుగా మార్చుకోవద్దు. నీ మనస్సును మిత్రునిగా చేసుకో.

రాగము, ద్వేషము, దుఃఖము, భయం అన్నీ నీ మనస్సులో ఉన్నాయి. నీ మనస్సు నశిస్తే ఇవి అన్నీ నశిస్తాయి. మనస్సును ఆత్మలో ఉంచు, ఆత్మలో ముంచు. ఇవి నీకు చేతకానపుడు ప్రాణాయామం చెయ్యి. ఒక అవతారపురుషుని యొక్క, గురువుయొక్క రూపమును ధ్యానించటం, నామాన్ని స్మరించటం ఏదో ఒకటి చెయ్యి. వీటి అన్నింటి ప్రయోజనం కూడా మనస్సు నశించటానికే.

నీ దుఃఖానికి కారణములు, రాబోయే జన్మకు హేతువులు అన్నీ మనస్సులో ఉన్నాయి. నీవు మనస్సును మ్రింగగలిగితే నీవు జ్ఞానివి అవుతావు, యోగివి అవుతావు. మనం ఎంత ప్రయత్నం చేసినా మన మనస్సును మ్రింగలేకపోతున్నాము.

చాలా పేచీలు మాటలవలన వస్తాయి. మాట ఎవరు మాట్లాడుతున్నారు. నోరు ద్వారా మనస్సు మాట్లాడుతోంది. నీ మాటకు మనస్సు కారణము. మనస్సు అణిగిఉంటే, నీ మనస్సును మూసుకుంటే నీకు శాంతి దొరుకుతుంది. నోరు మూసుకోవటం తేలికగానే ఉంది గాని మనస్సును మూసుకోలేకపోతున్నాము. మనస్సును మూసుకోమని భగవాన్ చెపుతున్నారు. మనం ఆలోచన లేకుండా మాట్లాడతాము. అన్ని గొడవలకు ఇదే కారణము. మనం ముందు మాట్లాడతాము, తరువాత ఆలోచిస్తాము. కాని ముందు ఆలోచించి తరువాత మాట్లాడాలి. మనస్సు చెపితే చేతులు పనిచేస్తున్నాయి, మనస్సు చెపితే నోరు మాట్లాడుతోంది. మనస్సును స్వాధీనం చేసుకో. అప్పుడు చేతులు కుదురుగా ఉంటాయి, నోరు కుదురుగా ఉంటుంది అంటున్నారు భగవాన్. నీ మనస్సును స్వాధీనం చేసుకొంటే నీ చేతులు, నీ నోరు నీ స్వాధీనంలోనే ఉంటాయి.

మనస్సుకు మౌనం కావాలి. మనస్సు దాని పుట్టుచోటుకు వెళితేగాని దానికి మౌనంరాదు. మనస్సు దాని పుట్టుచోటుకు వెళ్లినపుడు దానికి మౌనం ఏర్పడుతుంది. మనస్సు దాని మూలంలోనికి వెళ్లినపుడు అక్కడ లయించి పోతుంది. మనస్సు ఎక్కడయితే లయించి పోయిందో అక్కడనుండి శాంతి తరంగాలు వచ్చి సమాజమును ముంచుతాయి.

ప్రకృతిగుణాలనుండి విడుదల పొందాలంటే దేవుని అనుగ్రహం ఉండాలి. దేవుని అనుగ్రహం లేకుండా మానవుడు ఒక్క బలహీనత నుండి కూడా బయట పడలేడు. మన బలహీనతలు, మన కోరికలే మన సంకెళ్లు. ఇవి బయటకు కనబడవు. ఇవి లోపల జీవుడిని కట్టేస్తున్నాయి. నీ ప్రయత్నంవలన ఈ సంకెళ్లనుండి బయట

పడలేవు. దేవుని అనుగ్రహము అవసరము. నీ బలహీనతల నుండి విడుదల పొందినపుడు నీ హృదయంలో ఉన్న దేవుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు.

మీరు ఏదైనా పని మొదలుపెట్టి పూర్తిచేశారు అనుకోండి. ఈ శక్తి ఎక్కడినుండి వస్తోంది? దేవుని దగ్గరనుండి వస్తోంది. మీరు ఏమనుకొంటున్నారు. నేనే ఆ పనిని పూర్తి చేసాను అనుకొంటున్నారు. పని పూర్తి చేశాను అని మీ అహంకారము అనుకొంటోంది. మీ అహంకారమునకు శక్తి ఉందా? లేదు. శక్తి ఎవరిది? దేవుడిది. దేవుడు ఇచ్చిన శక్తితోనే పనిని పూర్తి చేస్తున్నాము. కాని ఆ విషయము మనకు తెలియటం లేదు. అది తెలియక మనవలననే అయింది అనుకొని మన అహంకారమును పెంచుకొంటున్నాము.

సమాజమునకు ఏదైనా సహాయం చేయాలంటే ముందు నీవు జ్ఞానివికా అని భగవాన్ చెపుతూ ఉండేవారు. నీకే శాంతిలేనపుడు ఇతరులకు శాంతిని ఎలా ఇస్తావు. నీకే కుదురులేనపుడు ఇతరులకు కుదురు ఎక్కడినుండి నేర్పుతావు. ఏదైతే ఇతరులకు ఇవ్వాలి అనుకొంటున్నావో అది నీవు అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. నీ దగ్గర ఏదైనా ఉంటే అది ఇతరులకు ఇవ్వగలవు. నీ దగ్గర ఏదీ లేదు అనుకో ఇతరులకు ఏమి ఇవ్వగలవు. మనస్సు హృదయంలో కరిగిపోయినపుడు నిజమైన మౌనం ఏర్పడుతుంది. ఆ మౌనంలోనుండి మహాశక్తి పుట్టుకొనివస్తుంది. ఆ శక్తి తరంగాలు సృష్టి అంతా వ్యాప్తిపొందుతాయి. ఎంతోమంది చైతన్యస్థాయి పెరగటానికి జ్ఞాని హృదయం నుండి వచ్చే శాంతి తరంగాలు. శక్తి తరంగాలు సహకరిస్తాయి.

నీవు హృదయం యొక్క లోతులలోనికి దిగినపుడు ఇంక ఊహాలోకాలలో విహరించవు. నీ ఇంద్రియాలు, మనస్సు నియమింపబడుతాయి. ఇంద్రియాలు నిన్ను బంధించవు. నీవు అతీంద్రియుడవు అవుతావు. నీ హృదయస్థానం నీకు తెలిసినపుడు నీ శరీరము మరణిస్తున్నా నేను మరణించటంలేదు అనే అనుభవం నీకు వస్తుంది.

కొంతమంది మనిషి బ్రతికి ఉండగా వాడిని సరిగాచూడరు. చనిపోయిన తరువాత 12వ రోజు అద్భుతంగా చేస్తారు. ఎందుకంటే గొప్పకోసం చేస్తారు. వారికి కావలసినది జ్ఞానంకాదు, గొప్పలుకావాలి. ఏదైనా ఒక పనిచేసినపుడు నీవు గొప్పలకోసం చేస్తున్నావా, ఇతరులకు ఉపకారంకోసం చేస్తున్నావా ఎందుకు చేస్తున్నావు అని భగవంతుడు చూస్తాడు. నీవు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నావో భగవంతుడు చూస్తాడు. బాహ్యంగా నీవు చేసే పనిని చూసి మోసపోయేటంత అమాయకుడు కాదు దేవుడు. దేవుడు సర్వజ్ఞుడు. ఆయనకు తెలియనిది అంటూ ఏదీ లేదు.

(దేవుడు అంతటా వ్యాపించి ఉంటాడు. ఒక అమ్మగారు భగవాన్‌తో మేము దూర దేశములనుండి వచ్చాము. ఇప్పుడు మిమ్ములను విడిచిపెట్టి వెళ్లిపోతున్నాము అని చెప్పారట. మీ ఇంటిదగ్గర నేను లేనా అని భగవాన్ అన్నారట. మీరు అరుణాచలంలో ఉన్నారు కదా, మా ఇంటి దగ్గర ఉండటం ఏమిటి అని ఆమె అంది. అప్పుడు భగవాన్ వారి ఇంటిలో ఏ గదిలో ఏమి ఉన్నాయో చెప్పి మీ ఇంటి దగ్గర నేను లేకపోతే ఇవి అన్నీ నాకు ఎలా తెలుస్తాయి అన్నారు. వాడు దేవుడు. దేవుడు సర్వాంతర్యామి.)

భగవద్గీత చాలాసార్లు చదువుతాము. అది అర్థం అవ్వకపోవటానికి కారణము మన దేహబుద్ధి. కృష్ణుడు ఏ చైతన్య స్థాయిలో ఉండి చెపుతున్నాడో ఆ స్థాయిని మనం పొందితే ఆయన మాట మనకు అర్థమవుతుంది. మన రాగద్వేషములను ప్రక్కకుపెట్టిచూస్తే ఆయనమాటలు మనకు తెలుస్తాయి. అలాగని మనం చదవటం మానకూడదు. చదవగా, చదవగా ఆయన అనుగ్రహం వలన మనకు ఆ మాటలు అర్థమవుతాయి. అర్థం చేసుకోవాలనే కాంక్ష మనలో ఉంది కాబట్టి ఆయన అనుగ్రహిస్తాడు.

★★★